చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు

# ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర

- అద్దె బస్సులతో అధోగతి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- కార్మికులను అణచివేసే చర్యలు మానుకోవాలి
- 'చలో బస్‌భవన్'లో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు అద్దె బస్సుల పేరుతో ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ నేతలు విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని చెప్పి మరిచిపోయిందని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ ట్యాక్స్‌ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఆర్టీసీ డ్రైవర్ల సంఖ్యను పెంచితే తెలంగాణలో మాత్రం కుదిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను తీసేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీలో 12 నుంచి 16 గంటల పాటు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సరఫరా చేయాలని కన్వీనర్ మౌలానా పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కో-కన్వీనర్ కత్తుల యాదయ్య కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డు ఇవ్వాలని సుద్దాల సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కమలాకర్‌రెడ్డి, బీ యాదగిరి, వివిధ జిల్లాల ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# తాగినడిపితే లైసెన్స్ రద్దే..

- అతివేగంగా, అధిక లోడ్‌తో వెళ్తే లైసెన్స్ క్యాన్సిల్
- నిబంధనలు మరింత కట్టుదిట్టం
- డేటాబేస్ ఆధునీకరణకు రవాణా, పోలీస్ శాఖల చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): మద్యం తాగి వాహనం నడిపితే వాహనదారుడిపై కేసు నమోదుతో పాటు లైసెన్స్ రద్దు కానున్నది. అధిక వేగం, బరువుతో గూడ్స్ వెహికల్స్ నడిపినా లైసెన్స్ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు. ఏడాదిలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. ఇందులో ఎక్కువగా డ్రంక్ అండ్ డైవ్ కేసులే ఉన్నట్టు తెలిపారు. ఒకే వ్యక్తి మూడు సార్లు మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసులు రవాణాశాఖకు సిఫార్సు చేయనున్నారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు రవాణా, పోలీస్ శాఖలు డేటాబేస్‌ను ఆధునికరించాలని యోచిస్తున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఫోటో లేదా ఆధార్ నంబర్ డేటాబేస్‌తో కనెక్ట్ చేయడంతో లైసెన్సు నంబర్, ఎక్కడ తీసుకున్నది క్షణాల్లో అధికారులకు తెలిసిపోనున్నది. దీంతో రవాణాశాఖ సులభంగా లైసెన్స్ సస్పెన్షన్ చేపట్టనున్నారు.

# ఎమ్మెల్యే ఆర్డర్..అనుమతులున్నా బుల్డోజర్

- విమర్శలకు తావిస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారుల తీరు
- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు.. పనుల అడ్డగింత
- అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో బిల్డర్ వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో చెలరేగుతున్న ఓ అక్రమార్కుడితో చేయి కలిపి శేరిలింగంపల్లి జోన్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కష్టార్జితంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులు పొందిన ఓ యజమానిని వివాదస్పద బిల్డర్ కోసం వేధించడం చర్చనీయాంశమవుతున్నది. గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలాన్ని వీ దేవరాజ్, వీ కల్యాణి పేరుతో 2022 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీకి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. అంతా పరిశీలించాక టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఇటీవల దేవరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే కాలనీ హౌజింగ్ సొసైటీపై పెత్తనం చలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్‌రావు కన్ను ఈ స్థలంపై పడింది. అక్కడి నుంచి పనులను అడ్డుకోవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో దేవరాజ్ గత నెల 27న శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే(అధికారపార్టీ) అండతో శ్రీధర్‌రావు చెలరేగిపోయాడు. ఆయన ఆదేశాలతో అధికారులు దేవరాజ్ నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇందేంటని ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు అందిందని అనుమతినిచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. ఈ క్రమంలో దేవరాజ్‌పై తరచూ వేధింపులు ఎక్కువయ్యాయి. అన్ని అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పనులు మొదలుపెడితే కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మాణ పనులు అడ్డుకుని, ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

## ద్రోహి సమాచారంతోనే ఎన్‌కౌంటర్

- విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు
- కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు బాధ్యత వహించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 9న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

ములుగు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈ నెల 1న ములుగు జిల్లా చెల్పాక వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి చంపారని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30న ఏడుగురితో ఉన్న దళం చెల్పాక పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామంలో నమ్మిన వ్యక్తికి భోజనాలు ఏర్పాటు చేయమని కోరారని తెలిపారు. అప్రూవర్‌గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారని చెప్పారు. చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు కాల్చి చంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రజాస్వామికవాదులు, విద్యాలయాలు, వ్యాపారసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, బాధ్యత వహించి, న్యాయ విచారణ జరిపి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 5 : మవోయిస్టులు ఇద్దరు మాజీ సర్పంచ్‌లను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు సుఖ్‌రామ్ ఆవ్‌లం, సుక్లు ఫర్సాను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో వారిని హత్య చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటన బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

## 'మెగాఫుడ్ పార్క్' సభ వెలవెల

- పాగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- విసుగెత్తిన ప్రజలు.. సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన వైనం

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : ఖమ్మం జిల్లా బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు సభ నుం లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడంతో ప్రజలు వెళ్లిపోయారు.

సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మధ్యలోనే వెళ్లిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

# హోంగార్డులకు నో 'రైజింగ్'

- ఏటా జరిగే కార్యక్రమాలకు సైతం మంగళం
- అడ్రస్‌లేని కవాతు, స్పోర్ట్స్‌మీట్, ప్రశంసాపత్రాలు
- అమరజవాన్ల త్యాగాలను అవమానించినట్టే
- నేడు హోంగార్డుల 75వ రైజింగ్‌డే

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఓ వైపు రాష్ట్రంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ 75వ రైజింగ్‌డేను గాలికి వదిలేసిందని హోంగార్డులు వాపోతున్నారు. దేశంలో హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమై 75 ఏండ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 6న ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన స్వర్ణోత్సవాలను ప్రభుత్వం, పోలీసుశాఖ గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. ఒక్క రక్తదానం మినహా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర హోంశాఖ సిద్ధంగా లేదని రాష్ట్రంలో హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల రైజింగ్‌డే రోజున ప్రతియేటా కవాతు, స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహించి తమను ప్రోత్సహించేవారని, ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు, ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు ఇచ్చేవారని, ఆరోజు తమకు భోజన ఏర్పాట్లు కూడా చేసేవారని చెప్తున్నారు. తాము ఎంతగానో నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇలా గాలికి వదిలేయడం ఆవేదనకు గురిచేస్తున్నదని అంటున్నారు. ఇది విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన వారిని అవమానించడమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసి, అన్ని జిల్లాల్లో ఘనంగా హోంగార్డుల రైజింగ్‌డేను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

### హోంగార్డుల సమస్యలపై పట్టింపేదీ?

'అటెండర్‌కు ఎక్కువగా.. పోలీసుకు తక్కువగా' డ్యూటీలు చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలని, 600కు పైగా ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. అలాగే హోంగార్డుల సాధారణ మరణానికి రూ.5 లక్షల నగదు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్టు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించాలని, ఆరోగ్య భద్రత తమకు కూడా వర్తింపచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

## 'కుష్టు' సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నైనాలలో సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారి వనాకర్‌రెడ్డి

నెల్లికుదురు, డిసెంబర్ 5: కుష్టు వ్యాధిని గుర్తించే సర్వేను పకడ్బందీగా చేయాలని తొర్రూరు డివిజన్ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నైనాల గ్రామంలో మెడికల్ ఆఫీసర్ డాక్ర్ శారదతో కలిసి సర్వే చేపట్టారు. ఈ సర్వే 15 వరకు చేస్తాన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ మహేశ్వరి పాల్గొన్నారు.

**'కుష్టు'ను ప్రాథమికంగానే గుర్తించాలి**

తొర్రూరు: కుష్టు వ్యాధిని ప్రాథమికంగానే గుర్తిస్తే అన్నివిధాలా ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ శారద అన్నారు. గురువారం తొర్రూరులో కుష్టు వ్యాధిగ్రతులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేశారు. వ్యాధిని పూర్తిగా నివారించేందుకు ఈ ఏడాది 'నేషనల్ స్ట్రాటజిక్ ప్లాన్ రోడ్‌మ్యాప్ ఫర్ లెప్రసీ' కార్యక్రమం చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందన్నారు. వైద్యసిబ్బంది వనాకర్‌రాజ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డోర్నకల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలి

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అసోసియేషన్ సభ్యులు

డోర్నకల్, డిసెంబర్ 5: డోర్నకల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలని గురువారం ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు గాంధీసెంటర్ వద్ద ప్లకార్డుస్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను డోర్నకల్‌లో నిర్మించి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు ముద్దం భాస్కర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక పుల్లారావు, పోటు శేఖర్, మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బీమనబోయిన సత్యనారాయణ, సభ్యులు కోండల్, రామకృష్ణ, సాయి పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న కిషన్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 5: విద్య సమాజంలో ఉన్నత విలువలు నేర్పుతుందని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. తన తండ్రి హత్తీరాం వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర సదన్‌లో అనాథ పిల్లలకు ఆయన దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అనాథ పిల్లలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బాలుర సదన్ సూపరిండెంటెంట్ కృష్ణవేణి, మోహన్, సునీల్‌బాబు, టీచర్లు ప్రియాంక, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ యువజన విభాగం

# రాష్ట్ర కార్యదర్శిగా రాజేందర్

నియామక పత్రం అందుకుంటున్న రాజేందర్

బయ్యారం, నవంబర్ 5: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన వేమిశెట్టి రాజేందర్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని గ్లోబుల్ కార్యాలయంలో గురువారం చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, రాష్ట్ర విభాగం అధ్యక్షుడు కలసాని సంజీవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అనంతరం నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ తన ఎంపికకు కృషి చేసిన చైర్మన్, అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కష్టాలు

- తాలు, తేమ పేరుతో నిర్వాహకుల కొర్రీలు
- తీవ్ర అవస్థలు పడుతున్న రైతులు
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న వైనం

గొల్లచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం

డోర్నకల్, డిసెంబర్ 5: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసి అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజులుగా తుపాన్ ప్రభావంతో ఆకాశంలో మబ్బులు ఏర్పడడంతో డోర్నకల్ మండలంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకుంటున్నారు. ఎండ రాకపోవడంతో తేమ 17 శాతం రావడం లేదని, దీంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కాంటాలు వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం రాలేదని, ధాన్యంలో తాలు ఉన్నదని, తుర్పాల పోయాలని ఇబ్బంది పెడున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేవని, వర్షం పడితే ధాన్యంపై కప్పేందుకు టార్పాలిన్లు గానీ కవర్లు అందుబాటులో లేవని తెలిపారు. 40 కిలోల ధాన్యంలో తరుగు కూడా కిలో నుంచి కిలోన్నర తీసున్నారని, దీంతో తమకు నష్టం కలుగుతుందని అన్నదాతలు వాపోతున్నారు. కొనుగోపై ప్రభుత్వం విధించిన షరతులు తట్టుకోలేక కొందరు రైతులు తక్కువ ధరకే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

### కాంటాలు త్వరగా వేయాలి

కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాటి సౌకర్యాలు లేవు. ప్రభుత్వం విధించిన షరతులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. తుపాన్ వల్ల ధాన్యం తేమ శాతానికి రావడం లేదు. తాలు ఉన్నదని, తుర్పాలు పోయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కాంటాలను త్వరగా వేయాలి. సన్న రకాలకు గిట్టుబాటు ధరతో పాటు, రూ. 500 బోనస్ వెంటనే అందేలా చూడాలి.

*-బానోత్ బాలాజీ, రైతు, కస్నాతండా*



తాళం వేసి ఉన్న అమీర్యాతండా పాఠశాల

## తెరుచుకోని పాఠశాల

**ఒకరోజు వేతనం నిలిపివేత, మెమో జారీ**

నర్సింహులపేట, డిసెంబర్ 5: మండలంలోని గోపతండా జీపీ పరిధి అమీర్యాతండా పాఠశాల ఉదయం 11 గంటల వరకూ తెరుచుకోకపోవడంతో విద్యార్థులు ఆరుబయట ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండగా, ఒకరు సెలవులో, మరొకరు పాఠశాలకు రాకపోవడంతో స్కూల్‌కు వచ్చిన విద్యార్థులు వెనుదిరిగి పోయారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంఈవో రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ముందస్తు సమాచారం లేకుండా సెలవు తీసుకున్న ఉపాధ్యాయుడికి ఒకరోజు వేతనం నిలిపి వేయడంతోపాటు మెమో జారీ చేసినట్లు తెలిపారు.

## తల్లిని ఇంటి నుంచి పొమ్మన్న కూతురు

**పోలీసులను ఆశ్రయించిన తల్లి**

నెల్లికుదురు, డిసెంబర్ 5: తల్లిని ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని కూతురు గెంటేయగా, తల్లి పోలీసులను ఆశ్రయించిన ఘటన ఇసుగుర్తి మండలం చిన్నముప్పారంలో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పొదిల రామక్కకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. రామక్క కుమారుల సమ్మతితో తన వద్ద ఉన్న డబ్బులను కుమార్తెకు ఇచ్చి ఆమె ఇంట్లోనే ఉంటున్నది. కూతురు ఇటీవల తల్లిని 'నా ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని గెంటేసింది.' దీంతో రామక్క పోలీసులను ఆశ్రయించి, కూతురు నుంచి తన డబ్బులు ఇప్పించాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## రెండు ఇండ్లల్లో చోరీ

**బంగారం, నగదు అపహరణ**

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 5: తాళం వేసి ఉన్న రెండు ఇండ్లల్లో చోరీ జరిగింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. మానుకోట పట్టణంలోని బెస్తబజార్‌కు చెందిన జంగిలి హరీశ్ చోరీ జరిగిందని, ఆరు తులాల వెండి, తులంన్నర బంగారు చైన్, రూ.ఆరు వేల నగదు, మల్లంబజారుకు చెందిన మహేందర్ ఇంట్లో తులం బంగారం చైన్, రూ.ఆరు వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపరించినట్లు పేర్కొన్నారు. అదే కాలనీకి చెందిన దుగ్గి పుల్లమ్మ ఇంట్లో చోరీకి ప్రయత్నించారని పేర్కొన్నారు. బాధితులు 100కు డయల్ చేయడంతో బ్లూకోర్ట్ కానిస్టేబుళ్లు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేసినట్లు తెలిపారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలి

నెల్లికుదురు, డిసెంబర్ 5: మండలంలోని నైనాల గ్రామంలో అన్యాక్రాంతమవుతన్న ప్రభుత్వ భూమిని సర్వే చేయించి కాపాడాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు బాణాల యాకన్న అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో సర్వే నంబర్ 610, 611లోని 3.15 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రభుత్వ పల్లె దవఖాన, నర్సరీ తదితర వాటికి వినియోగించారన్నారు. మిగిలిన సుమారు 35 గుంటల భూమి అన్యాక్రాంతమైందని, అధికారులు సర్వే చేసి మిగిలిన భూమిలో నిరుపేదలకు ఇందిరమ్మ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు పెరుమాండ్ల బాబు గౌడ్, తోట నర్సయ్య, వెంకన్న, రామరాజు, సమ్మయ్య, పుల్లయ్య, వెంకన్న, శ్రీను, కొమురయ్య పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు సీజ్

సీజ్ చేసిన ఇసుక ట్రాక్టలను చూపుతున్న అధికారులు

నర్సింహులపేట, డిసెంబర్ 5: మండలంలోని ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు (ట్రెంచ్‌లు( కందకాలు) తీసినప్పటికీ వాటిని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. గురువారం మండలంలోని జయపురం, కౌసల్యదేవిపల్లి, ఫకీరతండా శివారు ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా రమేశ్

రమేశ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో మంగమ్మ

గార్ల, డిసెంబర్ 5: పంచాయతీ కార్యదర్శుల గార్ల మండల అధ్యక్షుడిగా బానోత్ రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా ఎంపీడీవో మంగమ్మ రమేశ్‌ను గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు కిషన్, అభిలావ్, వెంకటేశ్, సరిత, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నగదు, బియ్యం అందిస్తున్న నాయకులు

గార్ల, డిసెంబర్ 5: మండల కేంద్రానికి చెందిన హమాలీ కార్మికుడు దొండ నంద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సీఐటీయూ నాయకులు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. రూ.14 వేల ఆర్థిక సాయం, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కందునూరి శ్రీనివాస్, మల్లయ్య, వీరస్వామి, ప్రవీన్‌కుమార్, సర్వర్, కోటయ్య, నాగరాజు, వీరన్న పాల్గొన్నారు.

## కేయూలో మూడు రోజుల సదస్సు

నయీంనగర్, డిసెంబర్ 5 : కాకతీయ విశ్వవిద్యాలయ చరిత్ర, టూరిజం మెనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 7,8,9వ తేదీల్లో ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ మూడు రోజుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోషల్ సైన్స్ విభాగాల డీన్, లోకల్ సెక్రటరీ మనోహర్, కార్యక్రమ సమన్వయ అధికారి రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా రాజేందర్

నయీంనగర్, డిసెంబర్ 5 : కాకతీయ విశ్వవిద్యాలయ నూతన పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్ విభాగాచార్యులు రాజేందర్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

## 18 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

నయీంనగర్, డిసెంబర్ 5 : కాకతీయ విశ్వవిద్యాలయ పీజీ మూడ